క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం: మంత్రి కోమటిరెడ్డి



నల్గొండ పట్టణంలో క్రీడాజ్యోతి ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: తమ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడలపై అవగాహన కలిగించేందుకు, ఆటలను ప్రోత్సహించేందుకు చేపట్టిన సీఎం కప్‌లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా జ్యోతి ర్యాలీ గురువారం నల్గొండకు చేరుకుంది. స్థానిక క్లాక్ టవర్ వద్ద జ్యోతిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అందుకున్నారు. క్రీడల వల్ల శారీరక, మానసిక సామర్థ్యం పెరుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో పాల్గొనాలని సూచించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని హైదరాబాద్ రోడ్ నుంచి క్రీడా జ్యోతి ర్యాలీని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రారంభించారు. జిల్లా యువజన క్రీడల అధికారి విష్ణుమూర్తిగౌడ్, ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హఫీజ్‌ఖాన్, ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ బొమ్మపాల గిరిబాబు, హాకీ అసోసియేషన్ సెక్రటరీ ఇమామ్‌కరీం, శంభులింగం, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ సి.హెచ్.పుల్లయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నల్గొండ: పెద్ద గడియారం వద్ద సీఎం కప్ క్రీడా జ్యోతిని అందుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఆ మిల్లులకు కేటాయింపులు లేనట్లే..!

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:



హుజూర్‌నగర్‌లోని రైస్ మిల్లులు

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ఈసారి ఎట్టి పరిస్థితిలోనూ డిఫాల్ట్ మిల్లర్లకు ఇచ్చేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు మిల్లర్లకు సబ్ కమిటీ తేటతెల్లం చేసింది. గతంలో సీఎంఆర్ విషయంలో మిల్లర్ల చరిత్రను చూసి ధాన్యం కేటాయింపులు చేయాలనుకుంటోంది. అంటే గతంలో సీఎంఆర్ ధాన్యం తీసుకుని సంవత్సరాలుగా తమ వద్దే ఉంచుకుని డిఫాల్టర్లుగా ఉండి ప్రభుత్వ ఒత్తిడి తరువాత బియ్యం పెట్టిన వారిపై కూడా జాగ్రత్తగా ఉండాలని నిర్ణయించుకుంది. ఒకవేళ ప్రభుత్వం దాన్ని కచ్చితంగా అమలు చేస్తే ఈసారి ఉమ్మడి జిల్లాలో దాదాపు 100 మిల్లులకు పైగా ధాన్యం కేటాయింపుల జాబితాలో ఉండే అవకాశం లేదు. అలా కాకుండా కేవలం గత సంవత్సరం వానాకాలం, యాసంగినే పరిగణనలోకి తీసుకుంటే మాత్రం ఉమ్మడి జిల్లాలో దాదాపు 37కు పైగా డిఫాల్ట్ మిల్లులను ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉంది.

☛ ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు జరుగుతున్న మిల్లులు 196 ఉన్నాయి. ప్రతి సీజన్‌లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఈ మిల్లులకు కేటాయించి వారి నుంచి బియ్యం తీసుకుంటుంది. సీఎంఆర్ బియ్యం ఇవ్వడంలో కొంత కాలం నుంచి మిల్లర్లు వారి ఇష్టానుసారం ప్రవర్తించడంతో ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. రూ.కోట్లు విలువ చేసే బియ్యం మిల్లర్ల వద్ద ఉండిపోవడంతో పౌరసరఫరాలశాఖ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దీని నుంచి బయటపడేందుకు ప్రభుత్వం అనేక ప్రయత్నాలు ప్రారంభించి కొంత మేర విజయవంతమైంది. గతంలో కొంత ధాన్యాన్ని వేలం వేసి అమ్మకాలు చేసిన సంగతి తెలిసిందే. దాని విషయంలోనూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఈసారి ధాన్యం కేటాయింపులు జాగ్రత్తగా చేయాలని కృతనిశ్చయంతో ఉంది.

ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్‌లో భాగస్వామ్యం అవుతున్న మిల్లులు

జిల్లా	పచ్చిబియ్యం మిల్లులు	బాయిల్డ్ బియ్యం మిల్లులు
నల్గొండ	22	63
సూర్యాపేట	24	40
యాదాద్రి	12	35

☛ 2019-20 నుంచి 2022-23 వరకు నాలుగు సంవత్సరాల లెక్క ప్రకారం ఉమ్మడి జిల్లాలో దాదాపు 100 వరకు డిఫాల్ట్ మిల్లులు ఉన్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. గత సంవత్సరం ప్రకారం చూస్తే ఉమ్మడి జిల్లాలో వానాకాలంలో 20 మిల్లులు, రబీలో 17 మిల్లులు డిఫాల్ట్ జాబితాలో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం గత చరిత్ర తీసుకుంటే ధాన్యం కేటాయింపులు చేసుకునేందుకు కొత్త మిల్లులకు అవకాశం కల్పించాల్సి వస్తుంది. గత సంవత్సరం మాత్రమే తీసుకుంటే పెద్దగా ఇబ్బందులు ఉండకపోవచ్చు. ముఖ్యంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన సన్నరకాల ధాన్యాన్ని నేరుగా గోదాముల్లోకి తరలించాలని నిర్ణయించినందున ఇక దొడ్డు రకాల ధాన్యం కేటాయింపులకు ఇబ్బందులు ఏర్పడవని అధికారులు అంటున్నారు.

గురుతర బాధ్యత మీదే..!





రాజపేట మండలంలో నూతనంగా చేరుతున్న ఉపాధ్యాయులు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే:

సర్కారు బడుల్లో మరింత నాణ్యమైన విద్యాబోధనకు ఎంతోవో పోస్టులు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ వడివడిగా జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైంది. డీఎస్సీ-2024 ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాలకు చెందిన 1,109 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారు తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. తొలిరోజు విద్యార్థులకు పాఠాలు బోధించి తమ ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కిందని ఆనందపడ్డారు. భావి పౌరులుగా ఎదిగే విద్యార్థులకు వారంతా మార్గదర్శకులు కావాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి జిల్లాలో ఇటీవల విధుల్లో చేరిన వివిధ విభాగాల ఉపాధ్యాయులు..

నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
535	322	252

బడి బయటి పిల్లలు బాట పట్టేలా..

చదువుకోవాల్సిన వయసులో పలు కారణాలతో బాలలు బడులకు దూరంగా ఉంటున్నారు. గత జనవరిలో విద్యాశాఖ చేపట్టిన సర్వేలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బడి బయట పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా చదువు విలువ తెలిసిన మీరు మీ బడుల పరిధిలో చదువుకు దూరమైన బాలలు బడిలో చేరేలా చూడాలి. తల్లిదండ్రులకు చదువు విలువపై అవగాహన కల్పించాలి. వారి కుటుంబాల్లోని బాలలు పనుల వైపు మళ్లకుండా అక్షర జ్ఞానం కల్పిస్తే వారి గుండెల్లో మీరు చిరస్థాయిగా నిలిచిపోతారు.




నూతన ఒరవడితో పాఠాల బోధన..

కొత్త ఆలోచనలతో ముందుకు సాగే విద్యార్థులే పోటీ ప్రపంచంలో రాణిస్తున్నారు. మీ పరిధి విద్యార్థులు బట్టీ చదువులకు పరిమితం కాకుండా కొత్త ఆలోచనలు చేసేలా ప్రోత్సహించాలి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పలు సామర్థ్య పరీక్షల్లో వెనుకంజలో నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. బడుల్లో కృత్యాధార బోధన అమలు చేస్తున్నా.. పూర్తి స్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు.

★ కొత్తగా చేరిన మీరు సిలబస్ పూర్తి చేశామా.. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేశామా.. అన్న దానికే పరిమితం కావొద్దు. మీరు చెప్పింది విద్యార్థులు ఎంతవరకు అర్థం చేసుకున్నారు, వారు ఏం నేర్చుకున్నారు అనే దానిపై దృష్టి పెడితేనే మీ బోధనకు సార్థకత. కృత్యాధార బోధనకు పెద్దపీట వేయాలి. ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో బోధన పరికరాలు తయారు చేసుకుని నూతన ఒరవడితో బోధన సాగిస్తే విద్యార్థులకు ప్రయోజనం.

స్మార్ట్‌ఫోన్‌ల కంటే పుస్తక పఠనం అలవాటు చేయాలి..



స్మార్ట్‌ఫోన్‌లకు అన్ని వయసుల వారు బానిసలవుతున్నారు. మీ పరిధి విద్యార్థులు చరవాణులకు బానిసలు కాకుండా వారికి మంచి అలవాట్లు నేర్పించండి. పాఠాలు చదవడానికే పరిమితం చేయకుండా స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవిత చరిత్రలు, మంచి సాహిత్యం చదివేలా ప్రోత్సహించండి. చదువు తరువాత ఆటపాటలు, మంచి పుస్తక పఠనం అలవాటు చేస్తే వారు జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడినవారు అవుతారు.

★ మీ బడిలో చదివే విద్యార్థులకు మీరున్నారన్న భరోసానివ్వండి. విద్యార్థులకు చదువు ఒక్కటే కాదు.. క్రమశిక్షణ, దేశభక్తి, ఆత్మగౌరవం నేర్పించడంపైన దృష్టి పెట్టాలి. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పించాలి. అప్పుడే మీరు ఉపాధ్యాయ వృత్తికి పరిపూర్ణత తెచ్చిన వారు అవుతారనడంలో సంశయం లేదు.

బొట్టుగూడ పాఠశాలలో సకల సౌకర్యాలు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా కేంద్రంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో లేని విధంగా పూర్తి స్థాయి డిజిటల్ తరగతులు, ఏసీ సౌకర్యంతో తీర్చిదిద్దనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్గొండలో నిర్మిస్తున్న బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పనులను గురువారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. బొట్టుగూడ ఉన్నత పాఠశాలను కార్పొరేట్ స్థాయికి మించి నిర్మాణం చేపట్టాలన్నారు. పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఎన్నాళ్లిలా..!

● నల్గొండ జిల్లా చింతపల్లి మండలానికి చెందిన 42 ఏళ్ల మహిళ రొమ్ము క్యాన్సర్ బారిన పడ్డారు. క్యాన్సర్ నాలుగో స్థాయికి చేరడంతో బాధితులు జనరల్ ఆసుపత్రి ఆలన వార్డులో చేర్చారు. చికిత్స పొందిన ఆమె పది రోజులకు మృత్యువాత పడ్డారు. కుటుంబ సభ్యులు ఎవరూ ఆమెను ఇంటికి తీసుకెళ్లక పోవడంతో రెండు రోజులు పోస్టుమార్టం గదిలో ఉంచి మున్సిపల్ సిబ్బంది ఖననం చేశారు.

● వేములపల్లి పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 55 ఏళ్ల మహిళ గర్భాశయ క్యాన్సర్ బారిన పడటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రూ.3.50 లక్షలకు పైగా ఖర్చు చేసినా ఆరు నెలల వ్యవధిలోనే ఆమె మృత్యువాత పడ్డారు.

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే:

ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ బాధితుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. మహిళల్లో వచ్చే క్యాన్సర్లు భయాందోళనకు గురి చేస్తున్నాయి. బాధితుల సంఖ్య పెరుగుతున్నా.. ప్రత్యేక వైద్యులు మాత్రం ఉమ్మడి జిల్లాలో ఒక్కరు కూడా అందుబాటులో లేక పోవడం గమనార్హం. నల్గొండ, సూర్యాపేటలో వైద్యకళాశాలలు అందుబాటులోకి వస్తే క్యాన్సర్ లాంటి రోగాలకు శస్త్రచికిత్సలు, కీమో థెరపి లాంటి వైద్యం అందుబాటులోకి వస్తుందని ఎదురు చూసిన బాధితుల ఆశలు నీరుగారాయి. ఎలాంటి క్యాన్సర్ లక్షణాలు కన్పించినా స్థానికంగా ఉండే జనరల్ ఫిజీయన్ల సూచనతో మాత్రలు వాడటం, లేదంటే హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు.

◆ ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు



మహిళలకు ఇబ్బందికరమే..

జిల్లాలో క్యాన్సర్ల బారిన పడుతున్న మహిళల పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు 380 మంది ఉన్నారు. రొమ్ము క్యాన్సర్ బాధితులు 461 మంది ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. లెక్కల్లోకి రానివారు కూడా అధికంగానే ఉంటారు.

ఆలన ద్వారా చికిత్స అందిస్తున్నాం:

డా.వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, నల్గొండ



జిల్లాలో ఆలన కింద క్యాన్సర్ బాధితులకు అనుభవం ఉన్న ఎంబీబీఎస్ వైద్యుల ద్వారా చికిత్స అందిస్తున్నాం. ఎంఎన్‌జేలో చికిత్స పొందుతున్న వారికి ప్రత్యేక వాహనం ద్వారా గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు మాత్రలు అందజేస్తున్నాం. దీంతో పాటు క్యాన్సర్ నాలుగో స్థాయికి వచ్చిన వారికి చికిత్స అందిస్తున్నాం. చివరి జీవితంలో బాధితులు ఇబ్బంది పడకుండా ఇక్కడ చికిత్స అందించడంతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తున్నాం.

ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన క్యాన్సర్ బాధితుల వివరాలు.. (ఈ ఏడాది సెప్టెంబరు వరకు)

	నల్గొండ జిల్లా				సూర్యాపేట				యాదాద్రి			
ఏడాది	రేడియేషన్	మెడిసిన్	సర్జికల్	రూ.కోట్లల్లో	రేడియేషన్	మెడిసిన్	సర్జికల్	రూ.కోట్లల్లో	రేడియేషన్	మెడిసిన్	సర్జికల్	రూ.కోట్లల్లో
2020	536	2,144	155	6.97	390	1,384	129	4.11	195	952	53	2.89
2021	745	2,851	254	7.80	424	1,905	193	4.96	283	1,454	124	4.29
2022	630	3,290	276	8.40	453	2,704	238	5.10	245	1,661	136	4.31
2023	723	4,257	341	7.62	551	3,191	265	5.11	256	2,223	167	3.41
2024	559	3,674	317	6.61	389	2,680	247	2.43	234	1,855	174	2.13

మహిళా హక్కుల సాధనకు పోరాటం: ఐద్వా



నల్గొండలో ఐద్వా ఆధ్వర్యంలో ప్రదర్శన

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: దేశంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఎదిరించి, మగువల హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తామని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి వెల్లడించారు. గురువారం నల్గొండలో ఐద్వా 13వ జిల్లా మహాసభను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అతివలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామని ఎన్నికల్లో హామీలిచ్చి నేటికి అమలు చేయకపోవడాన్ని వారు ప్రశ్నించారు. ఆడబిడ్డలను లక్షాధికారులను చేస్తామన్న లక్ష్యం ఏమైందని ప్రశ్నించారు. పేదలకు రేషన్ కార్డులు, పింఛన్లు అమలు చేయాలని కోరారు. విద్యా, వైద్యం అందని ద్రాక్షగా మిగిలిందన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల బారిన పడి అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా హక్కుల రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి నిధులు విడుదల చేయట్లేదన్నారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో ఖమ్మంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఐద్వా నాయకురాలు అశాలత, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, జిల్లా అధ్యక్షుడు వరలక్ష్మి, సరోజ, తుమ్మల పద్మ పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక.. నల్గొండ గ్రామీణం: ఐద్వా జిల్లా మహాసభల సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా పోలేబోయిన వరలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాలడుగు ప్రభావతి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఆఫీస్ బేరర్స్‌గా జిట్టా సరోజ, కొండా అనురాధ, నాగమణి, తుమ్మల పద్మ, భూతం అరుణకుమారి, నిమ్మల పద్మ, కారంపూడి ధనలక్ష్మి, పాదూరి గోవర్ధన, మేకల వర్ణ, దామెర లక్ష్మి, ఎండీ సుల్తానాతో పాటు 33 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

ప్రాధాన్య క్రమంలో భూ సేకరణ పూర్తి: కలెక్టర్



కలెక్టరేట్‌లో భూసేకరణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అధికారులు

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టుల కింద భూసేకరణపై గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

■ ప్రాజెక్టుల కింద గుర్తించిన భూమి, అత్యవసరంగా అవసరమయ్యే భూమి జాబితా తయారు చేసుకుని రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ, పట్టా, అటవీ భూముల విషయంలో ఆర్డీవో, తహసీల్దార్, డీఎస్‌వోలు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకుని ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించాలన్నారు.

■ భూసేకరణ బడ్జెట్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని, అన్ని ఎత్తిపోతల పథకాల కింద భూసేకరణ పీవీ స్థాయిలో ఉన్న వాటన్నింటికి వారం రోజుల్లో అవార్డు పాస్ చేయాలని ఆదేశించారు. భూ సేకరణకు సంబంధించి సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, పట్టాభూములు, జనరల్ అవార్డులకు సంబంధించి రైతుల సమ్మతితో అవార్డులు పాస్ చేయాలన్నారు. నెల్లికల్, నక్కలగండి తదితర ఎత్తిపోతల పథకాల కింద అటవీ భూములకు సంబంధించి ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తామని డీఎఫ్‌వో రాజశేఖర్ తెలిపారు.

■ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీవోలు శ్రీరాములు, సుబ్రహ్మణ్యం, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత: గుత్తా

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. చిట్యాల పురఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి, పోకల దేవదాసు, దూదిమెట్ల సత్తయ్య యాదవ్, వనమా వెంకటేశ్వర్లు, బుర్రి రవీందర్, సాగర్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



వట్టిమర్తిలోని శ్రీవేణుగోపాలస్వామి కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహిస్తున్న శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నవంబరు 6 వరకు అవకాశం

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన వారంతా ఓటర్లుగా నమోదు చేసుకునేలా చూడాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, టీచర్ల సంఘాలను కోరారు. నల్గొండ కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై గురువారం డీఈవో బి.భిక్షపతి, ఆర్ఐవో దస్రూనాయక్, ఇతర అధికారులతో కలిసి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, గుర్తింపు పొందిన పాఠశాలల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 280 మంది మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. ఎక్కువ మంది ఓటర్లుగా నమోదు చేసుకునేలా చూడాలని సంఘాల నాయకులకు సూచించారు. నవంబరు 6వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుకు అవకాశం ఉందని చెప్పారు. ఆరేళ్ల సర్వీసులో కనీసం మూడేళ్లు హైస్కూల్‌లో పనిచేసి ఉండాలన్నారు. స్టేషన్ మారితే పాత స్టేషన్ నుంచి సర్టిఫికెట్ పొందాలని సూచించారు. ఇటీవల బదిలీలు ఎక్కువగా జరిగినందున ఓటర్లు ఈ విషయాలపై అవగాహన ఉండాలని తెలిపారు.

ఇంట్లోనే అల్లి.. రికార్డులకెక్కి


అల్లికల తయారీలో వసంతలక్ష్మి

కోదాడ, న్యూస్‌టుడే: కొందరు మహిళలు ఇంట్లో పనులు చేస్తూనే తమకు నచ్చిన రంగాల్లో రాణించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వారిలో కోదాడ పట్టణానికి చెందిన మహంకాళి వసంతలక్ష్మి ఒకరు. కుట్లు, అల్లికల విభాగం పోటీలో గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కడంతో ఇటీవల విశాఖపట్నంలో ప్రశంసా పత్రం, అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే..

మొదటి స్థానంలో నిలిచి..

కుట్లు, అల్లికల విభాగంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల బృందం విశాఖపట్నం కేంద్రంగా ఈ పోటీలను నిర్వహిస్తుంది. గతేడాది డిసెంబరులో ఈ పోటీలను ప్రారంభించి ఈ ఏడాది సెప్టెంబరు 15 వరకు నిర్వహించింది. ఈ పోటీలో పాల్గొన్న మహిళలు గత పది నెలలుగా రకరకాల డిజైన్లను తయారు చేయాలి. నిత్యం ఆన్‌లైన్ విధానంలో మహిళలకు నిర్వాహకులు దిశానిర్దేశం చేస్తుంటారు. రోజుకో డిజైన్‌లో అల్లాల్సి ఉంటుంది. ఈ పోటీలో పాల్గొన్న వసంతలక్ష్మి పోటీలు ముగిసే సమయానికి 500లకు పైగా అల్లికలతో మొదటి స్థానంలో నిలిచి, స్టార్ పర్‌ఫార్మర్ ఆఫ్ ది ప్రాజెక్టుగా ఎంపికయ్యారు. ఉలెన్ దారం సాయంతో అల్లికలు చేస్తారు. ఈ దారం విశాఖపట్నం నుంచి తీసుకురావాల్సి ఉంటుంది. మిషన్ లేకుండా చేతులతోనే తయారు చేయాలి. ఒక్కో దానికి మూడు గంటల నుంచి పది గంటల వరకు సమయం పడుతుంది. పోటీదారులు తయారు చేసిన అల్లికలను అనాథ పిల్లలకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కుటుంబ సభ్యుల సహకారంతో: - వసంతలక్ష్మి

ఈ పోటీలో పాల్గొన్నప్పటి నుంచి రోజూ రకరకాల డిజైన్ల రూపంలో అల్లికలు తయారు చేశా. మా సోదరి విశాఖపట్నంలో ఉంటుంది. ఆమె సాయంతో ఈ పోటీలో పాల్గొని రాణించాను. గిన్నిస్ రికార్డుల్లో చోటు దక్కుతుందని ఊహించలేదు. ఈ అవార్డు సాధించడంలో నా భర్త, కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉంది.

అరచేతిలో ఓటరు సమాచారం

★ టీఎస్ఈసీ.జీవోవి. ఇన్ వెబ్‌సైట్‌లో ఓటు వివరాలు



భానుపురి, న్యూస్‌టుడే: కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారు.. మార్పులు చేర్పులు చేసుకున్నవారితో పాటు ఇది వరకు ఓటు ఉన్న వారు.. ఓటు చూసుకొనేందుకు జాబితా కోసం వెతుకుతుంటారు. అలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల సంఘం వెంటనే ఓటు ఉందో లేదో తెలుసుకొనేందుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించింది. ప్రతి ఎన్నికలకు ఎన్నికల సంఘం(ఈసీ) కొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతోంది.

అక్కడ చూసుకోలేని పరిస్థితి..


ఈసారి త్వరలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో తుది ఓటరు జాబితా విడుదల చేశారు. జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. కానీ చాలామంది అక్కడికి వెళ్లి ఓటరు జాబితా సరిచూసుకోవడానికి ఇబ్బంది పడుతుంటారు. ప్రత్యేకంగా సమయం కేటాయించాల్సి రావడంతో ఓటు ఉందో లేదో ఇక్కట్లు పడుతుంటారు. తీరా పోలింగ్ సమయానికి తమ ఓటు ఏమైందని ఆందోళన చెందుతుంటారు. అలాంటి సమస్యలు పరిష్కరించేందుకు ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుత తరుణంలో సాంకేతిక వినియోగం పెరిగిపోయింది. ప్రతి ఒక్కరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్ ఉంటోంది. ఎన్నికల సంఘం తీసుకొచ్చిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి అరచేతిలోనే చూసుకోవచ్చు.

ఓటర్ల వివరాలు	
జిల్లా	ఓటర్లు
సూర్యాపేట	6,83,181
నల్గొండ	10,42,493
యాదాద్రి	5,20,438

తెరిచేదిలా..

ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన వెబ్‌సైట్‌ను చూసుకొనేందుకు ముందుగా గూగుల్‌లోకి వెళ్లి tsec.gov.in అని టైప్ చేయగానే తెలంగాణ ఎలక్షన్ కమిషన్ పేజీ వస్తుంది. ఇందులో ఫైనల్ రోల్స్ జీపీ/వార్డు వైజ్ ఓటరు లిస్ట్ యాజ్ ఆన్ 28.09.2024 అనే ఐచ్ఛికం ఉంటుంది. దీనిని క్లిక్ చేయగానే జిల్లా, మండలం, గ్రామం వివరాలు నమోదు చేయాలని మరో పేజీ కనిపిస్తుంది. అనంతరం పంచాయతీకి సంబంధించిన ఓటరు జాబితా ప్రత్యక్షమవుతుంది. ఇందులో వార్డుల వివరాలు కూడా ఉంటాయి. మనం ఉండే వార్డుకు సంబంధించిన బాక్సును క్లిక్ చేస్తే అందులో పూర్తి వివరాలుంటాయి.

పచ్చటి కోక ధరించినట్లు.. దృశ్యం ఇట్లుండె..!



వేములపల్లి మండలం మిర్యాలగూడ రోడ్‌లో పొలాలన్నీ పచ్చగా..చూపరులకు కనువిందు చేస్తున్నాయి.. భూమాత పచ్చటి చీర ధరించినట్లు ఉన్న దృశ్యం ఆకట్టుకుంటోంది.. ఈ నెల చివర్లో వరి కోతలు ప్రారంభమవుతాయని గ్రామస్థులు తెలిపారు. - ఈనాడు, నల్గొండ

నల్గొండ బిషప్‌ను కలిసిన మంత్రి


బిషప్ కరణం ధమన్‌కుమార్‌తో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నీలగిరి, న్యూస్‌టుడే: నల్గొండ డయాసిస్ క్యాథలిక్ బిషప్ కరణం ధమన్‌కుమార్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బిషప్ గురుపట్టాభిషేకం పొంది 35 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి ఆయనను అభినందించారు. ప్రభు సేవలో మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు. మేత్రాసనానికి తనవంతుగా సహాయ, సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. మంత్రితో పాటు పురపాలిక ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణ, ఫాదర్ జోసఫ్, పసల శౌరయ, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి దర్శనంతో మానసిక ఆనందం: సుమన్


యాదాద్రి ఆలయ సన్నిధిలో సినీనటుడు సుమన్

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో స్వయంభువులుగా కొలువై ఉన్న పంచనారసింహుల దర్శనం మానసిక ఆనందం, ప్రశాంతత కలిగిస్తుందని సినీనటుడు సుమన్ వెల్లడించారు. కుటుంబ సభ్యులతో ఆయన గురువారం ఈ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహిమాన్విత దేవాలయాన్ని అద్భుతంగా నిర్మించిందన్నారు. సుమన్ వెంట ఆలయ మాజీ ధర్మకర్త పెలిమెల్లి శ్రీధర్ గౌడ్ ఉన్నారు. దైవ దర్శనం కల్పించిన ఆలయ అధికారులు, వేద పండితులు ఆశీస్సులు అందజేశారు.

పత్తిపంటపై కష్టాలు మొలకెత్తే..

చందంపేట, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలు పత్తి రైతుల పాలిట శాపంగా మారాయి. పత్తి ఏరివేత చేయాల్సిన సమయంలో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు తడిచి పత్తి చెట్ల పైనే మళ్లీ మొలకెత్తే పరిస్థితికి వచ్చింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. మొలకెత్తిన పత్తిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. దీంతో వారు చేసేదేమీలేక ఇంటి ఆవరణలో పత్తిని ఆరబెడుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు.


ఏరివేత కాకముందే వర్షాలకు పత్తి పంట పరిస్థితి ఇలా.

దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: జలాల్‌పురం గ్రామంలోని స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలున్న కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్లు సంస్థ ఇన్‌ఛార్జి డైరెక్టర్ లక్ష్మి తెలిపారు. రెండు నెలల అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ) కోర్సుకు బీకాం, పైథాన్ కోర్సుకు డిగ్రీ, బేసిక్ కంప్యూటర్(డాటా ఎంట్రీ ఆపరేటర్) కోర్సుకు ఇంటర్, ఆటోమొబైల్ 2వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ, వసతి ఉచితంగా ఉంటుందని, శిక్షణ అనంతరం కచ్చితమైన ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 28న సంస్థ ప్రాంగణంలో ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

తెలంగాణ జట్టు కెప్టెన్‌గా కొయ్యలగూడెం విద్యార్థి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి 32వ జూనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో పాల్గొన్న తెలంగాణ జట్టుకు చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ఎర్రగుంట అక్షయ్ కుమార్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ పోటీలు హరియాణా రాష్ట్రంలోని పానిపట్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. ఈనెల 20 వరకు కొనసాగనున్నాయి. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతూ క్రికెట్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. అండర్-19 విభాగంలో హరియాణా రాష్ట్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీలకు ఇతను కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 13 మంది సభ్యులున్న తెలంగాణ జట్టుకు కోచ్‌గా వికాస్, మేనేజర్‌గా లతీపుద్దీన్ వ్యవహరిస్తున్నారు.


తమిళనాడు జట్టుతో పోటీలో టాస్‌లో పాల్గొన్న తెలంగాణ జట్టు కెప్టెన్ కొయ్యలగూడేనికి చెందిన ఎర్రగుంట అక్షయ్‌కుమార్ (నీలం డ్రెస్)

కానిస్టేబుల్ సస్పెన్షన్, సీఐకి ఛార్జిమెమో..

గుర్రంపోడు, న్యూస్‌టుడే: మండలంలోని ముల్కలపల్లికి చెందిన రజిత హత్యకేసు నమోదు విషయంలో అవకతవకలకు పాల్పడిన వ్యవహారంలో గురువారం కానిస్టేబుల్ సత్యనారాయణను సస్పెండ్ చేయగా, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయకు ఛార్జిమెమో జారీ చేశారు. బాధితుల నుంచి డబ్బుల వసూలులో కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలున్న కానిస్టేబుల్ సత్యనారాయణను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేయగా, సీఐ ధనుంజయకు మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ ఛార్జిమెమో జారీచేశారు. ఇప్పటికే హత్యకేసును ఆత్మహత్య కేసుగా నమోదు చేసిన ఆరోపణలపై ఎస్ఐ నారాయణరెడ్డిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హత్య కేసు నమోదు చేయాల్సిన అధికారం సీఐ స్థాయి అధికారికి ఉండగా.. ఈ కేసులో ఆయనకు ఛార్జిమెమోతో సరిపెట్టి బాధ్యత లేని ఎస్ఐ, కానిస్టేబుల్‌పై సస్పెండ్ చర్యలు తీసుకోవటం చర్చనీయాంశంగా మారింది.

చికెన్ ధరలు	
ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

రేషన్ బియ్యం పాలిష్ చేసి అక్రమ రవాణా

★ ఇద్దరి అరెస్టు.. రూ.18 లక్షల సొత్తు స్వాధీనం: ఎస్పీ

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని మిల్లులో పాలిష్ చేసి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. వారి నుంచి రూ.18 లక్షల విలువ చేసే 504.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రెండు లారీలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

★ ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా కేంద్రానికి చెందిన చీమకుర్తి సుధాకర్ కొన్నేళ్లుగా రైతుల నుంచి సేకరించిన ధాన్యంతో పాటు గుంటూరు, బాపట్ల, నర్సారావుపేటలో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడు. ఆ బియ్యాన్ని స్థానికంగా ఉన్న మిల్లులో పాలిష్ వేయడంతో పాటు నకిలీ బిల్లులు తయారీ చేసి రూ.30 కిలోల చొప్పున నెలకు 10 నుంచి 12 లోడ్‌లను తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో వాడపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా పట్టుబడిన లారీతో పాటు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వాస్తవాలు ఒప్పుకున్నట్లు తెలిపారు.

★ ఇదే క్రమంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సయ్యద్ సలావుద్దీన్ అనే లారీ డ్రైవర్ గురువారం లోడు రేషన్ బియ్యంతో వెళుతుండగా పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం రావడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన మరో నిందితుడు అశోక్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, రూరల్ సీఐ వీరబాబు పాల్గొన్నారు.

గుంటూరు కేంద్రంగా నకిలీ పురుగు మందులు

★ అధికారుల తనిఖీలో బహిర్గతం


వీర్లపాలెంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో పురుగు మందులను పరిశీలిస్తున్న డీఏవో శ్రవణ్‌కుమార్, తదితరులు

దామరచర్ల, న్యూస్‌టుడే: ఏపీలోని గుంటూరు కేంద్రంగా పేరొందిన కంపెనీల పేరుతో తెలంగాణలో నకిలీ పురుగు మందుల సరఫరా జరుగుతున్నట్లు వ్యవసాయాధికారుల విచారణలో వెల్లడైంది. మిర్యాలగూడతో పాటు దామరచర్ల, అడవిదేవులపల్లి తదితర మండలాల పరిధిలో బ్రాండెడ్ కంపెనీ పేరుతో నకిలీవి రైతులకు విక్రయిస్తున్నారు. దీనిపై ప్రముఖ సంస్థ కంపెనీ ప్రతినిధులు రెండ్రోజుల క్రితం ఫిర్యాదు చేశారు.

◆ జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం మొదట మిర్యాలగూడలోని ఓ ఫర్టిలైజర్స్, సీడ్స్ దుకాణంలో తనిఖీ చేయగా ప్రముఖ కంపెనీ పేరుతో గల నకిలీ పురుగు మందులు ఉన్నట్లు గుర్తించారు. రూ.52,900 విలువైన 11 కిలోల బరువుగల 23 సాచెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారుడిని ప్రశ్నించగా.. ఓ వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించి డీలర్ నుంచి సరకు తమకు అందినట్లు తెలిపారు. సమాచారం ప్రకారం మండలంలోని వీర్లపాలెంలోని ఆగ్రోస్‌రైతు సేవా కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేయగా అక్కడా నకిలీవి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గుంటూరు నుంచి ధనావత్ రమేష్ ఈ ప్రాంతంలోని పలు దుకాణాలకు నకిలీ మందులు సరఫరా చేస్తున్నట్లు ఓ దుకాణ యజమాని వివరించారు.

◆ డీఏవో మాట్లాడుతూ.. నకిలీవి విక్రయిస్తున్న దుకాణదారుల అనుమతులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కంపెనీలకు సంబంధించిన ఇన్వాయిస్‌లను రైతులకు చూపించాలని, కొనుగోలు బిల్లులు అందించాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడుతున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో వ్యవసాయాధికారులు ఫిర్యాదు చేశారు. ఏడీఏ దేవ్‌సింగ్, ఏవో సైదానాయక్ తదితరులున్నారు.

ఊరంతా ఖాళీ..!


పొలాలు వద్ద చెట్ల కింద సేద తీరుతున్న గ్రామస్థులు

వేములపల్లి న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామాన్ని గురువారం గ్రామస్థులందరూ మూకుమ్మడిగా ఖాళీ చేశారు. ఏడాది కాలంగా గ్రామంలో వరుస మరణాలు జరుగుతున్నాయని, ఊరికి కీడు సోకిందనే అనుమానంతో గ్రామపెద్దలు ఒకరోజంతా గ్రామానికి వెలుపల ఉండాలని నిర్ణయించారు. తెల్లవారగానే ఇంటి ముందు కళ్లాపి కూడా చల్లకుండా ఇళ్లకు గ్రామంలోని హోటళ్లు, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు తాళాలు వేయడంతో ఊరంతా నిర్మానుష్యంగా మారింది. గ్రామంలో మొత్తం 1250 కుటుంబాలుండగా సుమారు 5500 జనాభా నివాసముంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సుమారు 76 మంది పలు కారణాలతో మృతిచెందారు. అందులో 32 మంది యువకులు, 21 మంది 50 ఏళ్లలోపు వారు, 23 మంది వృద్ధులున్నారు. వీరిలో గడిచిన రెండు నెలల్లోనే సుమారు 20 మందికి పైగా మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. తాళం వేసి పొలిమేరలో ఏర్పాటు చేసిన నిప్పును తీసుకొని వ్యవసాయ బావులు, భూములు, శివారు ప్రాంతాలకు తరలివెళ్లారు. అక్కడే వంటావార్పు చేశారు. సాయంత్రం తిరిగి ఇంటి బాట పట్టారు.


నిర్మానుష్యంగా మారిన శెట్టిపాలెం గ్రామం

కాల్వలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

త్రిపురారం, న్యూస్‌టుడే: మతి స్థిమితం సరిగా లేక ముదిమాణిక్యం కాల్వలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . ఖమ్మం పట్టణంలోని సాయిగణేష్ నగర్‌కు చెందిన కన్నెకంటి గోపికిషోర్ (57)కు నాలుగేళ్ల నుంచి మానసిక ఆరోగ్య పరిస్థితి బాగాలేదు. కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చూపించినా పరిస్థితి మారలేదు. అప్పటి నుంచి ఇష్టం వచ్చినట్లుగా తిరుగుతున్నాడు. ఆ క్రమంలో ఈనెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి గురువారం త్రిపురారం మండలం నీలాయిగూడెం పంచాయతీ పరిధిలోని ఘంటరావుక్యాంపు సమీపంలో ముదిమాణిక్యం కాల్వలో పడి మృతిచెందాడు. విషయం స్థానికులు పోలీసులకు తెలుపగా.. మృతదేహాన్ని మరణోత్తర పరీక్షల నిమిత్తం మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు హరిదీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ..

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి చెందిన ఘటన పీఏపల్లి మండలం మూనావత్ తండాలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటన పట్ల గుడిపల్లి ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మూనావత్‌తండాకు చెందిన మూనావత్ మోహన్ కుటుంబానికి, అతని పాలివారైన మూనావత్ బెల్లు, అతని కుమారులు కోటేష్, రమేష్‌తో కొద్ది రోజులుగా భూ వివాదాలున్నాయి. ఈ విషయమై బుధవారం సాయంత్రం మోహన్ కుటుంబానికి, బెల్లు కుమారులు కోటేష్, రమేష్‌లతో వ్యవసాయ పొలం వద్ద గొడవ జరిగింది. తర్వాత కొద్ది సేపటికి మూనావత్ మోహన్ కుమారుడు(13) ఇంట్లో కిటికీకి ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడు హైదరాబాద్‌లో చదువుతుండగా సెలవుల నిమిత్తం ఇంటి వద్ద ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతని మృతి పట్ల మోహన్ కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని కొండమల్లేపల్లి సీఐ ధనుంజయగౌడ్ పరిశీలించారు. ఈ విషయమై మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా గంధం ఊరేగింపు

నీలగిరి, న్యూస్‌టుడే: సయ్యద్ షా లతీవుల్లా ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గురువారం గంధం ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. స్థానిక మదీనా మజీద్ నుంచి గంధం ఊరేగింపును మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పోలీసు శాఖ తరఫున దర్గాకు సమర్పించే గంధం ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రారంభించారు. గంధం ఊరేగింపుగా మసీదు నుంచి పెద్దగడియారం చౌరస్తా మీదుగా ప్రకాశంబజార్, అంబేడ్కర్ చౌరస్తా, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, నెహ్రూగంజ్ నుంచి లతీవుల్లా ఖాద్రీ దర్గ వద్దకు చేరుకుంది. గుట్ట మెట్ల వద్ద అధికారులు, ప్రజా ప్రతినిధులు గంధం, పంకాలకు స్వాగతం పలికారు. ముతావలీలు గుట్టపైన లతీవుల్లా ఖాద్రీ దర్గా వద్ద గంధం సమర్పించారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, పురపాలిక ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఉర్సు గంధం ఊరేగింపులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ తదితరులు

గుట్టపైకి ఘాట్ రోడ్డు వేయిస్తా: మంత్రి కోమటిరెడ్డి

కుల మతాలకు అతీతంగా తెలంగాణలోని అన్ని ప్రాంతాల నుంచి లతీవుల్లా ఖాద్రీ దర్గాను దర్శించుకునే భక్తులు నేరుగా గుట్టపైకి వెళ్లడానికి రూ.30 కోట్లతో ఘాట్‌రోడ్డు నిర్మాణం త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఉర్సు ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని గౌస్‌నగర్‌లో గురువారం వెలుగుచూసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలుడు(15) భువనగిరిలోని ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 14న సాయంత్రం గేదెలకు పాలు పితికేందుకు తండ్రితో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పాలకేంద్రంలో పాలు పోసి ఇంటికి తిరిగి వచ్చారు. రాత్రి భోజనం చేసిన అనంతరం కుమారుడు తరచూ ఉమ్ముతుండగా తల్లిదండ్రులు గమనించి ఏమైందని అడగ్గా, వ్యవసాయ బావి వద్ద పురుగు మందు తాగానని చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. తన కుమారుడు ఒంటరిగా దిగాలుగా ఉండేవాడని తండ్రి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు గ్రామీణ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి అనంతరం రైలు కింద పడి యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన గురువారం మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో వెలుగు చూసింది. రైల్వే ఎస్సై పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ-కొండ్రపోల్ మధ్య రైలు పట్టాలపై యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాలేజీ బ్యాగులో లభించిన ఐడీ కార్డు ఆధారంగా విచారణ చేపట్టి వివరాలు కనుక్కొన్నారు. హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న త్రిపురారం మండలం అల్వాలపాడు గ్రామానికి చెందిన విద్యార్థి (18).. దసరా సెలవులకు ఇంటికొచ్చి.. తిరిగి కళాశాల హాస్టల్‌కు వెళ్తున్నట్లు తల్లిదండ్రులతో చెప్పి బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. అదే రోజు రాత్రి గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామన్నారు.

మృతదేహం పక్కనే పురుగు మందు డబ్బా పడి ఉండడంతో.. అది తాగిన అనంతరం రైలుకు ఎదురెళ్లి బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహానికి శవపరీక్ష అనంతరం తల్లిదండ్రులకు అప్పగించి.. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

నల్గొండ

•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

ఒత్తిడి ఎదుర్కొని పనిచేయాలి: డీఎంహెచ్‌వో

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొని పనిచేసినప్పుడే గుర్తింపు వస్తుందని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం మానసిక ఆరోగ్యంపై తెలంగాణ సైకాలజిస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానసికంగా ఇబ్బంది పడే వారికి అర్థమయ్యేలా చెప్పడంతో పాటు మాత్రలతో రుగ్మతులు తగ్గించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాము అధికారి శిల్ప, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి: సీపీఎం


కేతేపల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 5.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారన్నారు. ఇప్పటి వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో చాలా గ్రామాల్లో మధ్య దళారీలపై ఆధార పడి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని వివరించారు. పత్తి వేసిన ప్రారంభంలో అనావృష్టి, పత్తి పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు ఎక్కువ పడటంతో రైతులకు నష్టం జరిగిందన్నారు. పత్తి పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పారదర్శకంగా కమిటీలు వేయాలి

కేతేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం నియమించే కమిటీలను పారదర్శకంగా వేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు చెప్పారు. కేతేపల్లిలోని అమర వీరుల స్మారకభవనంలో గురువారం సీపీఎం మండల కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో చినవెంకులు మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా కమిటీలు వేసి ఆర్థికంగా వెనుకబడిన అసలైన నిరుపేదలనే లబ్ధిదారులుగా ఎంపికచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలను అమలుచేయకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. మండల కమిటీ కార్యదర్శి చింతపల్లి లూర్థుమారయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఎల్.రాజు, వి.సౌదయ్య, బి.అంజయ్య, జె.లింగయ్య, ఎన్.వెంకన్న, జి.జోజి తదితరులు పాల్గొన్నారు.

అండర్ 14 క్రికెట్ విజేత మహబూబ్‌నగర్

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాల ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన అండర్-14 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. రాష్ట్రం నుంచి పది జిల్లాల జట్లు హాజరు కాగా, మహబూబ్‌నగర్ ప్రథమ, రంగారెడ్డి, హైదరాబాద్ సంయుక్తంగా ద్వితీయ, నల్గొండ తృతీయ స్థానాలు దక్కించుకున్నాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ తెలిపారు. అనంతరం విజేతలకు జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ ట్రోఫీ అందజేశారు. ఈ క్రమంలో పతకాలను, ప్రశంసా పత్రాలను ఆయన చేతులమీదుగా బహూకరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని కన్వీనర్ శ్రీనివాసులు తెలియజేశారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్, సూపరింటెండెంట్ రామకృష్ణారావు, విజయ్‌పాల్, కృష్ణయ్య, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. పలు సమస్యలపై మంత్రికి వినతి పత్రాలు అందచేశారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

క్రైం రిపోర్ట్

మర్రిగూడ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుప్పల మండలంలోని అంతంపేట గ్రామానికి చెందిన చొప్పరి సైదులు, నేలపట్ల ముత్యాలి వ్యక్తిగత పనుల నిమిత్తం మర్రిగూడకి వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. రాంరెడ్డిపల్లి గ్రామ శివారులోని తేరుమర్రి వద్దకు రాగానే సరంపేట గ్రామానికి చెందిన రైతు తన వ్యవసాయ పని ముగించుకొని ట్రాక్టర్‌తో రోడ్డు మీదకు వస్తున్నాడు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఢీకొనగా.. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరికీ గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి చికిత్స నిమిత్తం మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హౌజింగ్ బోర్డు కాలనీలో మరో వ్యక్తికి ...

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డు హౌజింగ్ బోర్డు కాలనీ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మర్రిగూడకు చెందిన అన్నిమళ్ల రాజారాంతో పాటు అతడి స్నేహితుడు కల్లుకొండ ఏడుకొండలు కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108 సమాచారం ఇవ్వడంతో జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

టిప్పర్ లారీలు సీజ్

నార్కట్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఏడు టిప్పర్ లారీలు సీజ్ చేసిన ఘటన నార్కట్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా మండలంలోని బ్రాహ్మణ వెల్లంల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని టిప్పర్ లారీలో తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై క్రాంతికుమార్ తన సిబ్బందితో గురువారం ఎలాంటి అనుమతి లేకుండా వెళ్తున్న ఏడు టిప్పర్ లారీలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అవీ ఇవీ

న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి.. నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న నాలుగు హిందీ పోస్టుల భర్తీ విషయంలో విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ మొండికత్తి సునీత కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కేజీబీవీల్లో ఉన్న హిందీ పోస్టుల ఖాళీలు నాలుగు ఉండగా మూడు భర్తీ చేశారని పేర్కొన్నారు.

కక్షసాధింపుతోనే కేసులు.. నీలగిరి: రాజకీయ కక్షసాధింపుతో తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందికి గురిచేయాలని చూసిన వారికి హైకోర్టులో ఎదురు దెబ్బతగిలిందని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజియొద్దీన్ తెలిపారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనతోపాటు ఆరుగురిపైన మార్చి 2024లో వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో పెట్టిన కేసును హైకోర్టు కొట్టివేసిందని తెలిపారు.

సినిమాలు నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** విశ్వం, **పీవీఎన్:** మా నాన్న సూపర్ హీరో
నకిరేకల్: **రామకృష్ణ-** విశ్వం, **వెంకటేశ్వర-** దేవర

బకాయిలు విడుదల చేయాలి

నకిరేకల్, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉపకార వేతన, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శంకర్, జిల్లా అధ్యక్షుడు నరేశ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి వారి సమ్మెను విరమింపజేయాలన్నారు.

అన్నదాతకు మద్దతు..

అతివలకు ఆదాయం

స్వయం సహాయక సంఘాల ఆర్థికాభ్యున్నతికి ప్రభుత్వాలు చేయూతనందిస్తున్నాయి. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందించడానికి కొనుగోలు బాధ్యతను మహిళా సంఘాలకే అప్పగించారు. అతివలు ఏటా వర్షాకాలం, యాసంగి సీజన్లో గ్రామాల వారీగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. వీటిల్లో మహిళలు చురుకుగా పాల్గొంటున్నారు. ఇంకా ప్రారంభం కాని కేంద్రాల్లో మగువలను అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. వరి కోతలు ప్రారంభం కావడంతో స్వయం సహాయక సంఘాలతో పాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్) ఆధ్వర్యంలో గ్రామాల వారీగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మొత్తం 325 కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 29 సన్న ధాన్యం, 117 కేంద్రాల్లో దొడ్డు ధాన్యం కేంద్రాలను ప్రారంభించనున్నారు.

– కనగల్, న్యూస్‌టుడే:


పగిడిమర్రిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ (పాత చిత్రం)

16 ఏళ్ల నుంచి కేంద్రాల నిర్వహణ

మహిళా సంఘాలకు ఆర్థిక చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2006లో మొదటిసారిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. క్వింటా ధాన్యానికి రూ.32 చొప్పున కమీషన్ ఇస్తున్నారు. గ్రామైక్య సంఘాల నుంచి సభ్యులతో కమిటీ ఎన్నుకొని వారి ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇందులో 50 శాతం ఈ కమిటీ సభ్యులకు మిగతా 50 శాతం గ్రామైక్య సంఘానికి ఇస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ఖర్చులు పోనూ మిగిలిన డబ్బులను ఆ కమిటీలోని సభ్యులు పంచుకుంటారు. ఇలా కొనుగోళ్ల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.

అధికారులకు.. రైతులకు వారధిగా:



– మెండికత్తి యమున, పర్వతగిరి

కేంద్రానికి ధాన్యం వచ్చినప్పటి నుంచి తూకం వేసి మిల్లులకు తరలించే వరకు ప్రతి విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. చిన్న పొరపాటు జరిగిన రైతులకు నష్టం జరగడంతో పాటు కేంద్రాలకు చెడ్డ పేరు వస్తుంది. అందుకే ఉదయం నుంచి రాత్రి వరకు మేమంతా కేంద్రాల్లో కొనుగోళ్లలో నిమగ్నమవుతాం. రైతులు, అధికారులతో పాటు అందరి సహకారంతో ఎలాంటి సమస్య రాకుండా చూస్తున్నాం.

సమర్థంగా నిర్వహిస్తున్నాం



– మామిడాల పద్మ, బుడమర్లపల్లి

సీజన్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించింది మొదలు పూర్తయ్యే వరకు సమర్థంగా నిర్వహిస్తున్నాం. కొనుగోలు ద్వారా వచ్చే కమీషన్‌తో ఆర్థికంగా నిలదొక్కుంటున్నాం. రైతులకు మంచి సేవలు అందించడంతో పాటు సభ్యుల ఆర్థిక తోడ్పాటుకు ఉపయోగపడుతోంది.

మహిళలకు ప్రయోజనం

– సంకు హరి, ఏపీఎం, కనగల్

ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో మహిళలు సమర్థంగా పనిచేస్తుండటంతో జిల్లాకు మంచిపేరు వస్తోంది. ఏటా అత్యధికంగా ధాన్యాన్ని సేకరించడంతో లక్షలాది రూపాయల ఆదాయాన్ని మహిళలు పొందుతున్నారు. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించడంతో రైతులు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకుంటున్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించిన అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తదితరులు

మర్రిగూడ, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతిని పురస్కరించుకొని స్థానిక మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీడీవో మునయ్య, వెంకటేశ్వర్లు, బిట్టు శ్రీనివాస్, రవికుమార్, యాకుబ్ ఉన్నారు

గట్టుప్పల: వాల్మీకి జయంతి వేడుకలను మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తహసీల్దార్ రాములు, సురేష్, కృష్ణ, ఆంజనేయులు, సాయి, ప్రశాంత్, మల్లయ్య పాల్గొన్నారు.

చిట్యాల: వాల్మీకి జయంతిని చిట్యాలలోని మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎంపీడీవో జయలక్ష్మి వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రమేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ కల్చరల్: మహా కవి వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని వాల్మీకి నగర్‌లో గల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి మహర్షి రాసిన రామాయణం గురించి ప్రత్యేకంగా గానం చేశారు. పురపాలిక ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ ఆమేర్, సుదర్శనాచార్యులు, చిండలియా, పాండు, వాల్మీకి పండిట్, రామ్‌పాల్, బేద్ రాంపాల్, బాల, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ సంక్షేమం: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం నల్గొండ కలెక్టరేట్‌లో నిర్వహించారు. అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్‌లు కలెక్టరేట్ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీదేవి, కలెక్టరేట్ ఏవో మోతీలాల్, కలెక్టరేట్ సిబ్బంది వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయలంటూ గాంధీ విగ్రహానికి వినతి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నల్గొండ పట్టణంలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తూ నిరసన తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలల మనుగడను, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఆర్‌టీఎఫ్‌లను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఉన్నత విద్య అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాంమోహన్, నర్సింహ్మారెడ్డి, జానయ్య, అశోక్, నగేశ్, సంపత్, పాల్గొన్నారు.


నల్గొండలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, అధ్యాపకులు

కళాశాలల బంద్ విరమణ

నల్గొండ టౌన్: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ల విడుదల కోరుతూ గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న కళాశాలల బంద్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి కళాశాలలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర నాయకులు గురువారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ఉన్నత అధికారులతో జరిపిన చర్చలు సఫలీకృతం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

కళా ఉత్సవం.. సృజనాత్మకం


నల్గొండలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి కళాఉత్సవం పోటీలు ముగిశాయి. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నల్గొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను వెలికితీసేందుకు జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు నిర్వహించినట్లు డీఈవో బి.భిక్షపతి తెలిపారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ, స్థానిక సంస్థలు, తెలంగాణ మోడల్‌స్కూల్స్, కేజీబీవీ, ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాలు, ప్రభుత్వ ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీలో 38 పాఠశాలల నుంచి 156 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గాత్ర సంగీతంలో సిహెచ్. కీర్తన (కేజీబీవీ తిరుమలగిరి), వాయిద్య సంగీతం(వి.అక్షయ, కేజీబీవీ కట్టంగూరు), నృత్యంలో ఎస్.సిరివెన్నెల (ఎస్‌పీఆర్ హెచ్.ఎస్ మిర్యాలగూడ), సినీ కళలులో జె.శరణ్య (జి.ప.ఉ.పా బాలికలు దేవరకొండ), చిత్రలేఖనంలో ఆర్.గ్రీష్మ (ప్రభుత్వ జూనియర్ కళాశాల, హిల్‌కాలనీ, నాగార్జునసాగర్), సాంప్రదాయ కథలు చెప్పడంలో డి.రేణుక (కేజీబీవీ వేములపల్లి)లు ప్రథమ స్థానంలో నిలిచారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు నవంబరు 2024లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. విజేతలను డీఈవో బి.భిక్షపతి అభినందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఆర్.రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు భరోసా

నకిరేకల్, న్యూస్‌టుడే: రైతులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పారు. నకిరేకల్ మండలం చందంపల్లి, మంగళపల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించి మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కేంద్రాల్లో సజావుగా కొనుగోలు జరిగే విధంగా తాను బాధ్యత తీసుకుని కృషిచేస్తానని వివరించారు. ఏమైనా సమస్యలు, వేధింపులు ఉంటే టోల్‌ఫ్రీ నెంబరుకు గాని, తనకు, లేదా తహసీల్దారు, ఎంపీడీవోలకు రైతులు సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. డీఆర్డీవో శేఖర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, తహసీల్దారు జమీరొద్దీన్, ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీడీ మోహన్‌రెడ్డి, ఏపీఎం నరహరి, మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పారు. మంగళపల్లి పశు వైద్య కేంద్రంలో పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. నకిరేకల్ ఏడీ కిరణ్‌కుమార్, పశువైద్యాధికారులు జె.రాంరెడ్డి, బి.రవికుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్, వ్యవసాయాధికారి జానీమియా, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ రాంకిషన్‌రావు పాల్గొన్నారు.


నకిరేకల్: చందంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

నార్కట్‌పల్లి గ్రామీణం: రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని నెమ్మాని, జువ్విగూడెం, షాపల్లి, నక్కలపల్లి, పల్లెపహాడ్, అమ్మనబోలు, తొండల్‌వాయి, తిరుమలగిరి, మాండ్ర, బ్రాహ్మణవెల్లంల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. సట్టు సత్తయ్య, భరత్, సత్తయ్య, స్వామి పాల్గొన్నారు.

కట్టంగూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకుని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. కురుమర్తి, అయిటిపాముల, చెర్వుఅన్నారం, గంగాదేవిగూడెం, తెలువారిగూడెం, తొట్లవారిగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించి మాట్లాడారు. కేంద్రానికి తొలుత ధాన్యం తెచ్చే రైతులకు, తూకంలో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులకు తగిన వసతులు కల్పించాలని సూచించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాద యాదగిరి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్, ఏపీఎం సైదులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలో రిజిస్ట్రేషన్ కార్యాలయ సముదాయం ఎదురుగా వ్యర్థాలు, చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. రోజు వారీగా శుభ్రం చేయడంతోపాటు వ్యర్థాలను తరలించే విధంగా చర్యలు తీసుకోవాలి.
– నరేందర్, నల్గొండ.

✔ చెత్త, వ్యర్థాల కుప్పలను వెంటనే శుభ్రం చేయిస్తాం.
– నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక.

చండూరు, న్యూస్‌టుడే:

? శిర్దేపల్లి గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రహదారి ఎగుడుదిగుడుగా నిర్మించడం వల్ల వర్షం వచ్చినప్పుడు నీరు రోడ్డుపై చేరి మురుగు కుంటగా మారింది. దీంతో దోమలు, ఈగలకు ఆవాసంగా మారింది.
– రమేశ్, స్థానికుడు

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. పరిశీలించి తాత్కాలిక చర్యలు చేపడతాం. –శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి


చిట్యాలలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు సుంకరి భిక్షం గౌడ్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

చిట్యాల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ టీఎస్ కృషి చేస్తుందని యూనియన్ రాష్ట్ర జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం చిట్యాలలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన సదుపాయాల కల్పనలో పీఆర్‌టీయూఎస్ ముఖ్య పాత్ర పోషించిందన్నారు. ఉపాధ్యాయులందరు ఓటు నమోదు చేసుకొని యూనియన్ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. మేకల జానారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రావు, అజిత, భిక్షపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త గురువులకు సన్మానం

నాంపల్లి, న్యూస్‌టుడే : మండలంలో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించిన గాదెపాక వేలాద్రి, గాదెపాక సైదులు, ఆకులపల్లి నరేశ్‌లను స్వేరో స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకులపల్లి నరేశ్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. డీఎస్‌పీ మండల అధ్యక్షుడు ఇరిగి సుధాకర్, శ్రీను, చిరంజీవి, ఎల్లయ్య, రజినీకాంత్, నవీన్, వెంకటయ్య, పాల్గొన్నారు.

ఏసీ రిపేర్, సర్వీసింగ్‌లో శిక్షణ

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌సెట్) పదో తరగతి పాసైన గ్రామీణ యువకులకు ఏసీ రిపేర్, సర్వీసింగ్‌లో 30 రోజుల శిక్షణ అందిస్తున్నమని సంస్థ సంచాలకులు రఘుపతి ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం ఉంటుందన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన 19 నుండి 45 ఏళ్ల లోపు వయస్సు వారు అర్హులని తెలిపారు. ఈ నెల 20లోపు నల్గొండలోని రాంనగర్ ఆర్‌సెట్ అఫీసులో దరఖాస్తు చేయాలని సూచించారు.

అవగాహన సదస్సు

మర్రిగూడ, న్యూస్‌టుడే: సమాజంలో లింగ వివక్షను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మాడి యశోద అన్నారు. దామెర భీమనపల్లి ప్రభుత్వ పాఠశాలలో బాలల పరిరక్షణపై అవగాహన సదస్సును నిర్వహించారు. సమస్యలుంటే 1098కి ఫోన్ చేయాలని సూచించారు. ఐసీపీఎస్ రాము, సంజీవరావు, లచ్చిరామ్ పాల్గొన్నారు

వైభవంగా గీతాజ్ఞాన యజ్ఞం

నాంపల్లి, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని ఉమానాగలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆలయ కమిటీ ఛైర్మన్ పెద్దిరెడ్డి అనంతరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ రామకోటి గీతాజ్ఞాన యజ్ఞం ఘనంగా నిర్వహించారు. అన్నప్రసాద వితరణ అనంతరం యజ్ఞ గురువులకు సన్మానం చేశారు. కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

29 వరకు గడువు పొడిగింపు

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులు 2024-2025 సంవత్సరానికి విదేశాల్లో విద్యనభ్యసించేందుకు అంబేడ్కర్ ఓవర్‌సీస్ విద్యానిధి పథకం ద్వారా దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 29వ తేదీ వరకు పొడిగించినట్లు ఎస్సీ అభివృద్ధిశాఖ ఉప సంచాలకులు వి.కోటేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని అందరు ఎస్సీ అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ తెలంగాణ ఈపాస్.సీజీజీ.జీవోవి.ఇన్ నందు దరఖాస్తులు నమోదు చేసుకోవాలని కోరారు.

శబ్ద హోరు..

జంతువుల పరార్..

కష్టపడి పండించిన పంటలను పలు రకాల జంతువులు నాశనం చేస్తుంటాయి. వాటిని రక్షించుకునేందుకు అన్నదాతలు పలు రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. మండలంలోని కుదబక్షుపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు వరి సాగు చేస్తున్నాడు. చుట్టూ అటవీ ప్రాంతం కావడంతో కోతులు, అడవి దున్నలు పంటపై దాడి చేసి నష్టం కలిగిస్తున్నాయి. వినూత్నంగా ఆలోచించిన రైతు ఓ మైక్‌సెట్‌ను పంట మధ్యలో సినిమా పాటలు వచ్చేలా అమర్చాడు. దీంతో ఆ పాటల శబ్దానికి అవి రావడం మానేశాయి. –మర్రిగూడ, న్యూస్‌టుడే:



మిర్యాలగూడ

• మిర్యాలగూడ • నాగార్జునసాగర్ • దేవరకొండ

నాలుగు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ డ్యామ్ నుంచి నాలుగు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం రాత్రి 9గంటల సమయంలో అధికారుల నుంచి అందిన సమాచారం మేరకు ప్రస్తుతం సాగర్ డ్యామ్ నీటిమట్టం 590 అడుగులు కాగా 312.0450 టీఎంసీల నీటినిల్వ ఉంది. కుడికాల్వకు 7978 క్యూసెక్కులు, ఎడమకాల్వకు 6173 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. పవర్‌హౌస్‌కు 29435 క్యూసెక్కులు, 4 క్రస్టుగేట్ల నుంచి 32400, ఏఎమ్మార్పీకి 2400, వరదకాల్వకు 400 క్యూసెక్కులు వదులుతున్నారు.

త్రిపురారం, న్యూస్‌టుడే

? బస్టాండు సెంటర్ సమీపంలో అడవిదేవులపల్లి వెళ్లే మార్గంలో తాగునీటి పైపులైన్ లీకైంది. మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలి. – జి.మహేష్, త్రిపురారం

✔ రెండు రోజుల్లో వృథాను అరికడతాం. – కోడిరెక్క రాజేందర్, పంచాయతీ కార్యదర్శి

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని బంగారుగడ్డలో వీధిదీపాలు సక్రమంగా వెలగక ఇబ్బందులు పడుతున్నాం –అంజి, మిర్యాలగూడ

✔ వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం: – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ పట్టణంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోడ్ల నిర్మాణం చేపట్టాలి. –కె.వెంకట్‌రెడ్డి, దేవరకొండ

✔ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. వీలైనంత తొందర్లోనే నిర్మాణం చేపడతాం. –రాజు, పురపాలిక ఏఈ

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే:

? మండలంలోని చెన్నంనేనిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకే ఉపాధ్యాయుడు విద్యార్థులను ఇంటికి పంపారు. –పంపినవారు: ముదిగొండ మురళీకృష్ణ.

✔ మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించాం. మా ఆదేశానుసారం ఉపాధ్యాయులు సమయానికన్నా గంట ముందే విద్యార్థులను ఇంటికి పంపారు. –నాగేశ్వరరావు, మండల విద్యాధికారి

చర్యలు తీసుకోవాలని ధర్నా

చింతపల్లి, న్యూస్‌టుడే: వింజమూరులో అక్రమంగా పట్టాలు మార్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని ఇనాం భూమి(ఓఆర్సీ)ని పలువురు పంపిణీ చేసుకొని పంటలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని అన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. జంగయ్య, విజయ్‌కుమార్, వెంకటయ్య, యాదయ్య, అంజి, ముత్తయ్య, రాజు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

త్రిపురారం, న్యూస్‌టుడే: జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని అంజనపల్లి, త్రిపురారంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆయా గ్రామాల్లో 14 ఆవులకు, 356 గేదెలకు టీకాలు వేశారు. పశువైద్యాధికారులు నరేంద్ర, శశికళ, సిబ్బంది రాహుల్, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

దూదిపూలు... దళారుల పాలు

చందంపేట, న్యూస్‌టుడే

పంట సాగు నుంచి విక్రయించే వరకు కర్షకులు దళారుల చేతుల్లో మోసపోతూనే ఉన్నారు. రైతుల పక్షాన ఉండి అరికట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గత ఏడాది పత్తి క్వింటా ధర రూ.10వేలకు పైగా పలికింది. వర్షాధార భూములు అధికంగా ఉండటంతో దేవరకొండ డివిజన్ రైతులు వాణిజ్య పంటల సాగువైపు మొగ్గుచూపుతారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సైతం పత్తి సాగు గణనీయంగా పెరిగింది. దాదాపు 2 లక్షల ఎకరాల్లో పంట సాగు చేశారని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. పంట సాగు సమయం నుంచి నేటి వరకు అవసరానికి మించి వర్షపాతం నమోదు కావడంతో పొలాల్లో నీళ్లు నిలిచి పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. దీనికి తోడు పత్తి ఏరివేతకు ముందే అకాల వర్షాలు కురవడంతో చెట్ల మీదనే పత్తి తడిసి దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉండిపోయారు. వర్షాలకు పత్తి తడిసిపోతుండటంతో గత్యంతరం లేక కూలీలకు అధిక కూలీ చెల్లించి ఏరి వేయించారు. ఇంట్లో నిల్వచేసిన పత్తిని కొనుగోలుదారులు సునామీ పేరిట తక్కువ ధరకే కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో క్వింటాకు రూ.4-5వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. కానీ ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521లుగా ఉంది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో దళారులది ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది.



చందంపేటలో పత్తి కొనుగోలు చేసి లారీలో లోడ్‌చేస్తున్న కూలీలు

దిగుబడి అంతంత మాత్రమే..

దేవరకొండ డివిజన్ పరిధిలో పత్తిని అత్యధికంగా సాగుచేస్తారు. గత ఏడాది లక్షా 95వేల ఎకరాలలో సాగుచేయగా ఈ ఏడాది ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. పత్తి విత్తనాలు నాటిన సమయంలో వర్షాలు అనుకూలించడంతో రైతుల ఆశలు చిగురించాయి. సెప్టెంబరు, అక్టోబరులో వరుసగా కురిసిన వర్షాలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అన్నదాతలు ఆశించారు. కానీ సగానికి పైగా దిగుబడి పడిపోవడంతో ఆశలు అడియాసలయ్యాయి. దీనిని అదునుగా చేసుకొని దళారులు గ్రామాల్లో మకాంవేసి మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు: లక్‌పతి, ఏవో

పత్తి క్వింటాకు ప్రభుత్వం రూ.7521 మద్దతు ధర ప్రకటించింది. త్వరలోనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయి. మద్దతు ధర కంటే ఎక్కువగా వ్యాపారులు చెల్లిస్తామని మాయమాటలు చెప్పి తూకంలో మోసం చేస్తారు. పత్తిని దళారులకు కాకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే విక్రయించాలి.

ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా రమాశంకర్



దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ పక్షాన న్యాయవాదిగా దేవరకొండ పట్టణానికి చెందిన నెమ్మికంటి రమాశంకర్‌ను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడేళ్ల పాటు ప్రభుత్వ న్యాయవాదిగా సేవలు అందించనున్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే బాలునాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



త్రిపురారంలో అనుముల శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శిస్తున్న జానారెడ్డి

జానారెడ్డి పరామర్శ

త్రిపురారం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీపీ భర్త అనుముల శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల కత్తి పోట్లకు గురవడంతో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. గురువారం సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి త్రిపురారంలోని ఆయన స్వగృహంలో పరామర్శించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, కర్నాటి లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జైకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం ఇంత అధ్వానమా..?

గుర్రంపోడు, న్యూస్‌టుడే: 'వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంది.. మురుగుకాల్వల్లో పూడిక తీయలేదు.. పారిశుద్ధ్యం ఇంత అధ్వానంగా ఉంటే మీరేం చేస్తున్నారంటూ' మండల ప్రత్యేకాధికారి వి.వెంకటేశ్వర్లు ఆములూరు పంచాయితీ కార్యదర్శి సైదులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆములూరు, పాల్వాయి గ్రామాల్లో ఆయన పర్యటించి మురుగుకాల్వలు, పల్లె ప్రకృతివనాలు, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఎంపీడీవో మంజుల, మండల పంచాయతీ అధికారి పద్మ, ఏపీవో గోపాల్ రెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు తదితరులున్నారు.

రానున్న విద్యా సంవత్సరానికి పునఃప్రారంభం

చందంపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల కొరత కారణంగా గ్రామీణ ప్రాంతాలలో మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను రానున్న విద్యాసంవత్సరంలో పునఃప్రారంభానికి చర్యలు చేపడుతున్నట్లు ఎంఈవో చందర్‌నాయక్ అన్నారు. గురువారం ఎమ్మార్సీ భవనంలో నూతన ఉపాధ్యాయులకు ఎంపిక పత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయుల కొరతతో పడ్డ ఇబ్బందులు తొలిగాయని తెలిపారు. 2024 డీఎస్సీలో చేపట్టిన ఉపాధ్యాయ భర్తీలో మండలానికి 15 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు, నలుగురు ఎస్ఏలు వచ్చారని తెలిపారు.

కొనసాగుతున్న డిగ్రీ కళాశాలల బంద్

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన బంద్ కొనసాగుతుంది. మిర్యాలగూడలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ఎదుట సిబ్బంది గేట్లు మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. నర్సింగోజు రవి, శ్రీనాథ్, ఇంద్రసేనారెడ్డి, నాగార్జునరెడ్డి, సత్యం, గౌతమి, జానకిరాములు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: హెచ్ఐవీ, ఎయిడ్స్ మహమ్మారిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ సలహాదారు ఆంగోతు నందులాల్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, చౌరస్తాలో వ్యాధులపై ఎల్ఈడీ వాహనంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా టెస్టులు చేయించుకోవాలని తెలిపారు. శిరీష, బల్‌రాం, రవి, నీల, లలిత, కాషయ్య, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆంగోతు నందులాల్



చింతపల్లిలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న తహసీల్దార్ రమాకాంత్‌శర్మ



డిండి ఎంపీడీవో కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీడీవో వెంకట్

వాల్మీకి జయంతి వేడుకలు

చింతపల్లి, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతి వేడుకలను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. తహసీల్దార్ రమాకాంత్, ఆర్ఐ సునీత, శ్రీనివాస్‌రెడ్డి, అలివేలు, స్పందన, నవీన, రంగీబాయి పాల్గొన్నారు.

డిండి: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో వెంకట్, డిప్యూటీ తహసీల్దార్ రాగ్యానాయక్, శ్యాంనాయక్ పాల్గొన్నారు.


ధరలను నియంత్రణలోకి తేవాలి

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: పెరిగిన ధరలను తగ్గించి సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్ డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ పిలుపుమేరకు మండల పరిధిలోని యాద్గార్‌పల్లి గ్రామంలో కూరగాయల దండతో వారు గురువారం నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. రామకృష్ణ, వస్కుల సూర్యం, సీతారాములు, నీరజ, సైదులు, వెంకన్న, యశోద పద్మ, తదితరులు పాల్గొన్నారు.



యాద్గార్‌పల్లిలో కూరగాయల దండతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ప్రతిభకు బంగారు పతకం



సాయిబాబా

చింతపల్లి, న్యూస్‌టుడే: డిగ్రీ కళాశాలలో తెలుగు సబ్జెక్టులో 100 మార్కులు సాధించిన వింజమూరు గ్రామానికి చెందిన ఆరేకంటి సాయిబాబా బంగారు పతకం అందుకున్నాడు. సాయిబాబా చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయి వసతి గృహంలో ఉంటూ.. పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని సిటీ కళాశాలలో 2020-23లో డిగ్రీ పూర్తి చేశాడు. డిగ్రీలో తెలుగు సబ్జెక్టులో 100 మార్కులు సాధించడంతో కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు.

నల్లమలలో దేవరకొండ యువకుడి అదృశ్యం

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన మాడెం ఈదయ్య నల్లమల అటవీ ప్రాంతంలో అదృశ్యమయ్యారు. ఈనెల 14న శ్రీశైలం దర్శనానికి ద్విచక్రవాహనంపై బయల్దేరారు. తిరిగి ఇంటికి రాలేదు. నాగర్‌కర్నూల్ జిల్లా మున్ననూరు అటవీ ప్రాంతంలో ఈదయ్య వాహనం, సెల్‌ఫోన్, బ్యాగు అక్కడే పడి ఉండడాన్ని చూసిన కుటుంబ సభ్యులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి నేటి వరకు ఇంకా ఆచూకీ తెలియకపోవడంతో అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీలను పరిశీలించినప్పుడు మున్ననూరుకు వాహనంపై ఒక్కరే వెళ్లినట్లు కనిపించింది.

క్రైం రిపోర్ట్



మాడెం ఈదయ్య

మృతదేహంతో ఆందోళన

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: తన తండ్రి హత్యకు కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరుతూ.. కుమారులు అనుమానితుడిగా భావిస్తున్న వ్యక్తి ఇంట్లో మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేశారు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కాకునూరి కొండయ్యను బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసిన విషయం తెలిసిందే. నల్గొండ ప్రాంతీయ ఆసుపత్రిలో పంచనామా నిర్వహించిన తర్వాత మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి కుమారులు, బంధువులు మృతదేహాన్ని నేరుగా గ్రామంలోని హత్యకు కారణమని భావిస్తున్న అనుమానితుడి ఇంట్లోకి తీసుకెళ్లారు. మాడ్గులపల్లి, వేములపల్లి మండలాల ఎస్సైలు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చినా.. గురువారం రాత్రి ఎనిమిది గంటల వరకు ఆందోళన విరమించలేదు. చివరికి ఇరువర్గాలతో మాట్లాడించి, న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని బాధిత ఇంటికి తరలించారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై కృష్ణయ్య

స్వచ్ఛమైన నీటిని అందించేలా కృషి చేయాలి

వేములపల్లి న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని రైతువేదికలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గురువారం వేములపల్లి, మాడ్గులపల్లి గ్రామ మంచినీటి సహాయకులకు చేతిపంపుల మరమ్మతుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ వెంకట్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. గ్రామంలో మంచి నీటి సరఫరాలో లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. కలుషిత నీటిని ప్రజలకు అందించినట్లయితే రోగాల బారిన పడే ప్రమాదం ఉందనే విషయాన్ని గమనించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాభవాని, శిక్షకులు ప్రసాద్, క్రాంతికుమార్, వెంకన్న, శ్రీనివాస్, గ్రామ మంచినీటి సహాయకులు, మిషన్ భగీరథ సహాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ఈ వెంకటేశ్వర్లు

క్రీడలతో శారీరక దృఢత్వం: ఎమ్మెల్యే

హాలియా, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వం కలగడానికి దోహదపడతాయని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక జడ్పీ హెచ్ఎస్‌లో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ డివిజన్ స్థాయిలో క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభించి మాట్లాడారు. 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల్లో క్రీడాకారులకు పోటీలు నిర్వహించనున్నారు. పుర ఛైర్‌పర్సన్ యడవల్లి అనుపమరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ జిల్లా కన్వీనర్ వాసుదేవరావు, ఎంఈవో కృష్ణమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోండి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎక్కడికైనా 24 గంటల్లో సరకు రవాణా చేసే ఆర్టీసీ కార్గో, లాజిస్టిక్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ ఏటీఎం రవీందర్ కోరారు. ఆర్టీసీ కార్గోపై ప్రచారంలో భాగంగా గురువారం మిర్యాలగూడలో ర్యాలీ, వ్యాపార సముదాయాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోలతో పాటు బస్టాండ్లు, ప్రధాన పట్టణ కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సేల్స్ బృందం నాయకుడు శ్యాంకుమార్, పలు డిపోల సిబ్బంది పీఎన్ రావు, హరిలాల్, జానీపాషా తదితరులున్నారు.

పలువురు న్యాయమూర్తుల బదిలీ

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలువురు న్యాయమూర్తులను బదిలీలు, నియామకాలు చేస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి కుషాయిగూడలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు మిర్యాలగూడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న నూగూరి అపూర్వ రవళి సూర్యాపేట ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా రానున్నారు. సూర్యాపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్ పదోన్నతిపై కోదాడ సీనియర్ సివిల్ జడ్జిగా ఇప్పటికే బదిలీ అయ్యారు. హైదరాబాద్ నుంచి రజిత గోపు సూర్యాపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా రానున్నారు. వీరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా 17 మంది జూనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయాలైన ఘటన మండల పరిధిలోని ఆలగడప గ్రామపంచాయతీ పరిధిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అవంతీపురం గ్రామానికి చెందిన నాగయ్య ద్విచక్రవాహనంపై కోదాడ-జడ్చర్ల ప్రధాన రహదారిలో ఆలగడప వెళ్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో వ్యతిరేక దిశలో వచ్చి ఢీకొట్టాడు. దీంతో నాగయ్య తలకు తీవ్ర గాయమైంది. వెంటనే పట్టణంలోని ఆసుపత్రికి, అక్కడ నుంచి నల్గొండ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మరో ద్విచక్రవాహనదారుడు వాహనం వదిలేసి వెళ్లినట్లు పేర్కొన్నారు.

పరిశీలన

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: ముదిమాణిక్యం గ్రామంలో పారిశుద్ధ్య పనులను మండల ప్రత్యేకాధికారి దస్రు నాయక్ గురువారం పరిశీలించారు. పారిశుద్ధ్య సామగ్రి స్టాక్, బ్లీచింగ్ పౌడర్, గ్రాస్ కట్టింగ్ మిషన్‌లను పరిశీలించారు. స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంకు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యత, తాగునీరు అక్కడ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో మోసిన్‌బిన్ అహ్మద్, ఏపీవో సూర్యానాయక్, పంచాయతీ కార్యదర్శి, టీపీఏ రాధ, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలున్నారు.



ముదిమాణిక్యం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఎస్‌వో దస్రునాయక్

సంక్షిప్త సమాచారం

పోషకాహార లోపాన్ని అధిగమించాలి... **డిండి:** బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పోషకాహార లోపాన్ని అధిగమించాలని ఎంఈవో గోప్యానాయక్ అన్నారు. గురువారం చెర్కుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. ఆరేళ్లలోపు పిల్లల్లో ఎత్తు, బరువు కొలతలు చేపట్టి పెరుగుదలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. సూపర్‌వైజర్ కల్లు రేణుకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం... వేములపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని సుమారు 125 మందికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 30 మందికి పలురకాల చికిత్సలపై ఆసుపత్రికి సూచించారు. వైద్యులు అఖిల్, సురేష్, ప్రసన్న, తుషారా, మార్కెటింగ్ మేనేజర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నియామకం... చింతపల్లి: భాజపా మండల గిరిజన మోర్చా అధ్యక్షుడిగా రామవత్ యుగంధర్ నియామకం అయ్యారు. ఈ మేరకు గురువారం మండల అధ్యక్షుడు శివర్ల రమేష్ నియామక పత్రాన్ని అందించారు. మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ జహంగీర్, చెన్నయ్య, అభినవ్, భీమేష్, మధు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి... కొండమల్లేపల్లి: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని మండల విద్యాధికారి ఆర్.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

దరఖాస్తు చేసుకోవాలి... పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని దుగ్యాల గ్రామంలో గల ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో గణితం బోధించుటకు గాను ఆసక్తి, అర్హులైన వారు ఈనెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ నకిరెకంటి శ్రీనయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** విశ్వం, **శ్రీనివాస:** వేట్టయన్

విట్రోస్: దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక, మార్టిన్

రోడ్డు ధ్వంసమై.. రోగుల ఇక్కట్లు

నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే మిర్యాలగూడలోని డాక్టర్స్ కాలనీలో రహదారులు పూర్తిగా ధ్వంసమై భారీ గుంతలతో అధ్వానంగా మారాయి. దీంతో వైద్య చికిత్సల కోసం వచ్చే రోగులు, వారి సహాయకులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కాగా పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ్ సైతం డాక్టర్స్ కాలనీ రహదారిని తక్షణమే నిర్మించాలని గురువారం పుర కమిషనర్ ఎండీ యూసుఫ్‌ను కోరినట్లు తెలిపారు.



- న్యూస్‌టుడే, మిర్యాలగూడ



మిర్యాలగూడ: ఈదులగూడ కూడలిలో రోడ్డుపై ఏర్పడిన గుంత

రహదారిపై గుంత.. ప్రమాదమే చెంత..

నిత్యం రద్దీగా ఉండే మిర్యాలగూడలోని ఈదులగూడ కూడలిలో రోడ్డుపై భారీ గుంత ఏర్పడి వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కోదాడ వైపు నుంచి వచ్చే అన్ని వాహనాలు అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపైకి ఎక్కి గుంటూరు, హైదరాబాద్ వైపు వెళ్లేందుకు ఈ రోడ్డునే ఉపయోగిస్తారు. దీంతో రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. గుంతకు అడ్డంగా బారికేడ్ పెట్టి.. వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎన్‌హెచ్ డీఈఈ బాలునాయక్ తెలిపారు.

- న్యూస్‌టుడే, మిర్యాలగూడ పట్టణం